


విజయ కేతనం చూపిస్తున్న చింతా ప్రభాకర్



కొండాపూర్ : ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలుపుతో విజయ కేతనం చూపుతున్న మండల నాయకులు

# సంగారెడ్డి గడ్డ.. బీఆర్ఎస్ అడ్డ

- 9వేల మెజార్టీతో చింతా ప్రభాకర్ గెలుపు
- రౌండ్ రౌండ్‌కు పెరిగిన మెజార్టీ
- సంబురాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు

సంగారెడ్డి, డిసెంబరు 3 : అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డిలో బీఆర్ఎస్ విజయ దుందుభి మోగించింది. సంగారెడ్డి గడ్డ.. బీఆర్ఎస్ అడ్డ అని నియోజకవర్గ ప్రజలు నిరూపించారు. ఆదివారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని రుద్రారం శివారులో గీతం యూనివర్సిటీలో ఓట్ల లెకింపు జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన లెక్కింపు మందకొడిగా సాగడంతో సంగారెడ్డి ఫలితం రావడానికి కొంత జాప్యం జరిగిందని చెప్పవచ్చు. సంగారెడ్డి ప్రజలు విజ్ఞతతో ఓట్లు వేయడంతో గులాబీ జెండా ఎగిరింది. బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ 9,297వేల మెజార్టీతో విజయం సాధించారు. తొలి నాలుగు రౌం డ్లలో బీఆర్ఎస్ అభ్యర్థికి మెజార్టీ రాగా, 5 నుంచి 9 రౌండ్ల వరకు కాంగ్రెస్‌కు అధిక్యం వచ్చింది. 10వ రౌండ్ నుంచి 17 వరకు మెజార్టీ వచ్చింది. 18వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు అధిక్యం లభించినా 9,297వేల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో 184979 ఓట్లు పోలవగా, బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు 82614 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 73317 ఓట్లు వచ్చాయని అధికారులు స్పష్టం చేశారు.

**సంబురాల్లో బీఆర్ఎప్ శ్రేణులు..**

బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు గణేశ్‌గడ్డ నుంచి భారీ ర్యాలీ నిర్వహించేందుకు తరలివచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చి పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం చింతా ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సంబురాలు

**కొండాపూర్‌లో సంబురాలు**

కొండాపూర్, డిసెంబర్ 3 : సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై 7 వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ తనయుడు చింతా సాయి సాథ్‌ను కొండాపూర్ మండల నాయకులు కలిసి శభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతీపాండురంగం, వైస్ ఎంపీపీ లక్ష్మీరామచందర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రుక్ముద్దీన్, సర్పంచులు శివలీలాజగదీశ్వర్, ప్రకాశం, ఉపసర్పంచ్ ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీలు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, యాదయ్య, మొఖీం, ఎంపీటీసీలు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మ్యాకం విఠల్, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మోహన్ గౌడ్, సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ శేఖర్, జైరాం, రఘునాథ్‌రెడ్డి, జలీల్, గురుకిరణ్, నరేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

**కందిలో సంబురాలు**

కంది, నవంబర్ 3 : సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలుపొందడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కందిలో సంబురాలు జరుపుకొన్నారు. దీంతో పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంది ఉప సర్పంచ్ ఖురేషీ, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణాగౌడ్, నాయకులు రవి, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

**సంగారెడ్డిలో పార్టీలకు పోలైన ఓట్ల వివరాలు..**

| రౌండ్ | బీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | బీఎస్పీ | ఆధిక్యం |
|---|---|---|---|---|---|
| 1. | 5414 | 3957 | 1375 | 88 | 1457 |
| 2. | 5134 | 4727 | 1151 | 72 | 507 |
| 3. | 5141 | 4353 | 898 | 55 | 158 |
| 4. | 5389 | 4389 | 1024 | 60 | 1000 (కాంగ్రెస్) |
| 5. | 4097 | 4634 | 1536 | 53 | 537 (కాంగ్రెస్) |
| 6. | 3617 | 4836 | 1309 | 22 | 1219 (కాంగ్రెస్) |
| 7. | 3817 | 4536 | 1809 | 21 | 719 (కాంగ్రెస్) |
| 8. | 3976 | 4291 | 1058 | 20 | 315 (కాంగ్రెస్) |
| 9. | 2754 | 3973 | 1254 | 30 | 1219 (కాంగ్రెస్) |
| 10. | 5016 | 4575 | 1321 | 65 | 443 |
| 11. | 6262 | 3756 | 1453 | 74 | 2506 |
| 12. | 5987 | 2979 | 2659 | 29 | 2808 |
| 13. | 4956 | 3998 | 1260 | 62 | 958 |
| 14. | 4856 | 4217 | 956 | 122 | 639 |
| 15. | 5035 | 4354 | 1003 | 67 | 681 |
| 16. | 5099 | 4423 | 250 | 73 | 676 |
| 17. | 4488 | 4093 | 854 | 89 | 395 |
| 18. | 1734 | 1919 | 355 | 33 | 185 (కాంగ్రెస్) |
| మొత్తం | 82614 | 73317 | 20509 | 1035 | |





పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది



కందిలో సంబురాలు జరపుకొంటున్న బీఆర్ఎస్ నాయకులు



చింతా ప్రభాకర్ గెలుపుతో సంబురాలు జరుపుకొంటున్న కార్యకర్తలు





ఓట్ల లెక్కింపులో పాల్గొన్న అధికారులు

# ఈ విజయం దుబ్బాక ప్రజలకు అంకితం

- దుబ్బాక అభివృద్ధే నా లక్ష్యం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయను
- ప్రతిపక్షమైనా దుబ్బాక అభివృద్ధి కోసమే నా పోరాటం
- పార్లమెంట్‌లో ఎంపీగా.. ఇప్పుడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రతిపక్షమే కాదా
- పని చేసే నాయకుడికి ఏదైనా ఒక్కటే



దుబ్బాకలో విజయోత్సవ ర్యాలీలో ప్రజలు, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, డిసెంబర్ 3 : మెదక్ ఎంపీగా రెండు సార్లు.. ఇప్పుడు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ అం దించిన దుబ్బాక ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తనను ఇంతగా ఆదరించిన దుబ్బాక ప్రజలకు ఏమిచ్చిన రుణం తీర్చుకోలేమన్నారు. నా విజయం పూర్తిగా దుబ్బాక ప్రజలకే అంకితమన్నారు. ఎంపీగా రెండు సార్లు, ఇప్పుడు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ అందించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని, ఇందుకు దుబ్బాక ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయలేదని, ఇకముందు చేయబోనని ఆయన స్పష్టం చేశారు. తనను ఆదరించిన దుబ్బాక ప్రజలకు, రాజకీయ ఎదుగుదలకు కారణమైన కేసీఆర్‌ను మరిచిపోలేనని స్పష్టం చేశారు. ప్రతిపక్షమైనా, అధికారమైనా తనకు దుబ్బాక అభివృద్ధే లక్ష్యమని తెలిపారు. తాను ఎంపీగా కేంద్రంలో ప్రతిపక్షంలో ఉంటూ.. మెదక్ పార్లమెంట్‌కు ఎన్నో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశానని తెలిపారు. రైల్వే లైన్లు, కేంద్రియ విద్యాలయం, రోడ్లు ఇలా ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. దుబ్బాక అభివృద్ధి కోసం శాసనసభలో పోరాడైనా నిధులు తీసుకువస్తానని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 6 గ్యారెంటీలు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతున్నదన్నారు. అధిష్ఠానం సూచనలతో మా కార్యాచరణ ఉంటుందని, ఎప్పటికీ ప్రజల పక్షాన తమ ఆరాటం.. పోరాటం కొనసాగుతున్నదన్నారు.